అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- వేడుకలు ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ


మాధవధారలో సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రొంగళి జగన్నాథం, చొక్కాకుల వెంకటరావు తదితరులు


వైవీ సుబ్బారెడ్డికి స్వీట్ తినిపిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: ఉత్తర నియోజకవర్గంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో జరిగిన వేడుకలను ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా చెరుకుగెడలు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దులు, గాలిపటాలతో సంప్రదాయ బద్ధంగా భోగి మంటలు వెలిగించారు. పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సంక్రాంతి కానుకగా నూతన వస్త్రాలను సుబ్బారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ప్రజలందరికీ వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజులు సంక్రాంతి శుభకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, ససపల చంద్రమౌళి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, బర్కత్ అలీ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఏపీ యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ రాష్ట్ర నాయకులు కాశీవిశ్వనాథ్, పేడాడ రమణికుమారి, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, కె.పి.రత్నాకర్, పి.సునీత, జిల్లా నాయకులు ఆళ్ల శివగణేష్, శ్రీనివాసరాజు, ఎం.లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ మండల కన్వీనర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


డూడూ బసవన్నను ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజు, పార్టీ నాయకులు


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న కె.కె.రాజు


వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో భోగి మంటలు వెలిగించి సంబరాలు నిర్వహిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంక్రాంతి సందడి

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో పార్టీ నియోజవకర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయ ఆవరణలో భోగి మంటలు వేసి, ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు అందమైన రంగు వల్లులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. ముగ్గుల పోటీల్లో మొదటి విజేతగా పల్లా రూపాశ్రీ, ద్వితీయ స్థానంలో బత్తుల శ్యామలదేవి, తృతీయ స్థానంలో తాటిపూడి తనూజ ప్రవంతి నిలిచారు. విజేతలకు కె.కె.రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష, ఫ్లోర్ లీడర్, మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు నీలి రవి, కె.పి.రత్నాకర్, పి.సునీత, మాజీ కార్పొరేటర్లు బులుసు జగదీష్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణికుమారి, రాష్ట్ర డైరెక్టర్లు, జేసీఎస్ మండల ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బందికి నూతన వస్త్రాలు అందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజు


ముగ్గుల పోటీ విజేత పల్లా రూపాశ్రీకి ప్రథమ బహుమతి అందజేస్తున్న కె.కె.రాజు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని శుక్రవారం పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, పలువురు సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ


చీరలు, దుప్పట్లు అందజేస్తున్న కె.వి.బాబా

సీతంపేట: విశాఖ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా మనుమడు ఎం.డి.ఖాజా మొహిద్దీన్ నవాజ్ ప్రథమ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అక్కయ్యపాలెంలోని ఆయన ఇంటి వద్ద స్థానిక మహిళలకు చీరలు, పురుషులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.వి.బాబా మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలకు అయ్యే ఖర్చులో ఎక్కువ భాగం సేవా కార్యక్రమాలకు వినియోగించామన్నారు. 150 మందికి చీరలు, దుప్పట్లు అందజేశామని, సీతమ్మధార పాపా హోమ్‌లో పిల్లలను అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాజుద్దీన్, ఇస్మాయిల్, నిజాం, బాషా, అయూబ్, సుగుణ, మోతి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలస్యంగా బయల్దేరిన శ్రీకాకుళం-వికారాబాద్ స్పెషల్

తాటిచెట్లపాలెం: శ్రీకాకుళం రోడ్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు బయల్దేరవలసిన శ్రీకాకుళం రోడ్-వికారాబాద్(08547) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్‌లకు చేరుకోనుంది.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లింలు, చిన్నారులు

సీతమ్మధార: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెంలోని మదీనా మెమోరియల్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హజరత్ ఖాదర్ వలీ, హజరత్ మౌలా ఆలీ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మసీదుల్లో ముస్లింలు ఖురాన్ పఠించి చిన్నారులచే నాతే కలం ఆలపించారు. పరిసర ప్రాంతాల్లో చందనోత్సవ ర్యాలీ చేసి, పాతీ హఖానీ జరిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం చిన్నారులచే ప్రత్యేక కార్యక్రమం, ఆదివారం కవ్వాలి పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యావంతుడిని ఎన్నుకోండి

సీతంపేట: రానున్న ఎన్నికల్లో విద్యావంతుడు, ప్రతిభావంతుడైన వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని మాజీ జాతీయ క్రికెటర్ జి.వి.వి.ఎస్.కమలాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్ర అభివృద్ధికి, పిల్లల భవిష్యత్‌కు దోహదపడుతుందన్నారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఆలోచించి సరైన వ్యక్తికి ఓటేయాలని సూచించారు. ఓటరు లిస్టులో పేరు ఉన్నది లేనిదీ ముందుగా ఒకసారి చూసుకోవాలన్నారు. ఏ పార్టీ అయినా ఆహ్వానిస్తే రానున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సీతమ్మధార: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవే, దొండపర్తి, డైమండ్ పార్కు, 80 అడుగుల రోడ్డు పరిసర ప్రాంతాల్లో రెడ్ సిగ్నల్స్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్ సిగ్నల్ క్రాస్ చేస్తూ నిబంధనలు పాటించని పలువురు వాహన చోదకులను హెచ్చరించి, కౌన్సెలింగ్ చేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల రోడ్డు నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్ల కుటుంబ సభ్యులను సీఐ పిలిపించి మాట్లాడారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ వి.వాణిశ్రీ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


రూల్స్ పాటించని ద్విచక్ర వాహన చోదకులకు సూచనలిస్తున్న సీఐ అమ్మినాయుడు

కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం


గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు రాజాస్వామి


సారె తీసుకువస్తున్న భక్తులు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో శుక్రవారం ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో శ్రీగోదారంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణమూర్తులకు సారె, నూతన వస్త్రాలు సమర్పించారు. ఉదయం 4 గంటలకు స్వామికి అభిషేకం, అలంకరణ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ట్రస్టీ సభ్యులు ఝాన్సీ, సిబ్బంది వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు.

బాల నృత్య కళాకారులకు అంతర్జాతీయ డిప్లొమాలు

సీతమ్మధార: టర్కీ ఇస్తాంబుల్‌కు చెందిన ఫోక్‌లెర్ బోజాజికి సాంస్కృతిక సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఆన్‌లైన్ డ్యాన్స్ కాంపిటీషన్స్‌లో విశాఖ జిల్లాకు చెందిన బహుభాషా బాల నృత్య కళాకారులకు డిప్లొమాలు లభించాయి. ఇంటర్నేషనల్ డ్యాన్స్ కౌన్సిల్ గుర్తింపు పొందిన ఈ సంస్థ ప్రతి ఏడాది అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ఫోక్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తోంది. గతేడాది విశాఖకు చెందిన బాహుభాషా నృత్య కళాకారిణి ఆర్.హర్షిత టీనా అత్యధిక మార్కులతో అంతర్జాతీయ నృత్య డిప్లొమాను అందుకుంది. ఈ ఏడాది డ్యూయెట్ జానపద విభాగంలో బట్టు అనురాధ(తగరపువలస), వేటూర కమలిని శ్రీవర్ష(సీతమ్మధార), సోలో సీనియర్స్ విభాగంలో గోకా డింపుల్(ఆశీలమెట్ట), మంత్రి మోక్షిత(మద్దిలపాలెం), సబ్ జూనియర్స్ విభాగంలో ఎస్.అనన్య(సింహాచలం), బోగాది వర్షిణి(వేపగుంట), బి.పూజిత చందన(బాలయ్యశాస్త్రి లేఅవుట్), నందూరి జోషిత(కంచరపాలెం), ఎస్.ఎస్.ఎస్.వైష్ణవి(సింహాచలం)లకు ప్రథమ, ద్వితీయ స్థాయి డిప్లొమాలు లభించాయి. గతంలో న్యూఢిల్లీ, ఇండోనేషియా, థాయిలాండ్, సింగపూర్ వంటి ప్రాంతాల్లో జరిగిన నృత్య ప్రదర్శనలో పాల్గొని వీరు అవార్డులు అందుకున్నారు. వీళ్లంతా నగరానికి చెందిన స్కూల్ ఆఫ్ థియేటర్స్ ఆర్ట్స్ నాగరాజు పట్నాయక్ వద్ద నృత్యంలో శిక్షణ పొందుతున్నారు.


డిప్లొమా పత్రాలతో బాల నృత్య కళాకారులు

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతలు హరిజగదీష్, విజయ్‌కుమార్‌కు బాండ్ అందిస్తున్న ఏఈవో నరసింగరావు, పీఆర్వో నాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం మురళీనగర్‌కు చెందిన బి.హరి జగదీష్ కుమార్ రూ.లక్ష, అక్కయ్యపాలేనికి చెందిన ఆడారి విజయ్‌కుమార్ లక్షా 116 రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు ఏఈవో నరసింగరావు, పీఆర్వో అప్పలనాయుడు బాండ్లు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనంకల్పించారు.

పండగ వేళ.. అప్రమత్తం

తాటిచెట్లపాలెం: సంక్రాంతి పండగ వేళ చోరీలు జరిగేందుకు అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంచరపాలెం క్రైం పోలీసులు సూచించారు. ఊర్లో సమయంలో ఇంట్లో సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్లను అమర్చుకోవడం అలవాటు చేసుకోవాలని క్రైం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సునీల్‌లు తెలిపారు. విలువైన బంగారం, వెండి వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ఊర్లో సమయంలో వారి పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు


స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ట్రస్టు ప్రతినిధులు


వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ రమణరావు తదితరులు

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ మళ్ల వెంకటరావు అధ్యక్షతన అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చోడవరం జూనియర్ కళాశాల లెక్చరర్ రేణుక కిశోర్, ట్రస్టు ప్రధాన కార్యదర్శి కందాల ప్రభాకరరావు, ట్రస్టు సాంస్కృతిక విభాగం ప్రతినిధి పంతుల లలిత మాట్లాడుతూ వివేకానంద జీవిత విశేషాలను వివరించారు. మళ్ల వెంకటరావు మాట్లాడుతూ చికాగో నగరంలో స్వామి వివేకానంద చేసిన స్ఫూర్తిదాయక ఉపన్యాసాన్ని వివరించారు. మళ్ల లక్ష్మి, గౌరవాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సుభద్ర, అనిల్, ఆదిత్య, కనకరాజు, అశ్విని, నిర్మల, ట్రస్టు సభ్యులు, మహిళలు, యువత వివేకానందుని చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు పంచిపెట్టారు.

యువతకు ఆదర్శనం

భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం వివేకానంద ఆస్పత్రి ప్రాంగణంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ ఆర్.రమణరావు వివేకానంద చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిగా నిలిచిన స్వామి వివేకానందను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.వి.సత్యనారాయణ, బీవీపీ రాష్ట్ర సంస్కార్ ప్రముఖ్ ఎం.వి.రాజశేఖర్, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జి.ఎస్.వి. మాణిక్యాలరావు, సీనియర్ సభ్యులు జి.అరుణ జ్యోతి, టి.వి.నాగేశ్వరరావు, సిహెచ్.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

మురళీనగర్: స్వామి వివేకానందుడి బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఇమ్మిడియట్ పాస్ట్ గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. మురళీనగర్ సెక్టార్-3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు వివేకానందుడి మండపంలో వివేకానందుడి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివేకానందుడి బోధనలను సభ్యులు పఠించారు. కార్యక్రమంలో ప్రశాంతి పార్కు సభ్యులు జీవీ రత్నం, గోవిందరావు, చంద్రశేఖర్, డీఎస్ మూర్తి, నాయుడు, నాగేశ్వరరావు, డి.వెంకటరావు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, మంగాదేవి, జ్యోతి, జయ, పద్మ, శిరీష, సురేంద్రకౌర్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యుల నివాళి

మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన వివేకానందుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు, యువతలో సామాజిక సేవా దృక్పథం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, పూర్వాధ్యక్షుడు ఎం.భాస్కరరావు, జిల్లా 101 ఎలెక్టెడ్ గవర్నర్ కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు ఎ.వి.సుబ్బారావు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, కార్యవర్గ సభ్యుడు టి.వి.రమణ, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, కె.జి.కృష్ణారావు, సిహెచ్.కృష్ణమూర్తి, కార్యదర్శి చెల్వరాజు, జాలీ వాకర్ ప్రకాశరావు పాల్గొన్నారు.


ప్రశాంతి పార్కులో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప్పలపాటి శుభ, కమిటీ సభ్యులు


మురళీనగర్ వాకర్స్ పార్కులో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

ఆధ్యాత్మిక సమన్వయం.. పవిత్ర యజ్ఞం

మహారాణిపేట : ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమనేది పవిత్రమైన యజ్ఞమని జగద్గురు పీఠం భౌగోళిక కో-ఆర్డినేటర్ జర్మన్ దేశీయుడు లుడ్గర్ ఫిలిప్స్ పేర్కొన్నారు. అంకోసా ఫంక్షన్ హాలులో శుక్రవారం జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహించిన ప్రాక్పశ్చిమ సభా కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు మాస్టర్ ఈకే, గతంలో భౌగోళికంగా సేవలందించిన మాస్టర్ కె.పార్వతీకుమార్ వివిధ దేశాల్లో చేసిన ప్రసంగాలు, వారు రాసిన గ్రంథాల్లో ఉన్న పరమ గురువుల మార్గానికి నేడు వేలాది మంది పాశ్చాత్యులు ప్రభావితం చెందుతున్నారన్నారని లుడ్గర్ వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ భౌగోళిక నిర్వాహకులు కె. గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రాక్పశ్చిమ యజ్ఞ నిర్వహణలో భాగంగా మాస్టర్ పార్వతీకుమార్ 65 పర్యాయాలు విదేశాలలో పర్యటించారన్నారు. మాస్టర్ ఈకే రాసిన ఓవర్సీస్ మెసేజెస్ 8వ సంపుటాన్ని, అలాగే పార్వతీకుమార్ రాసిన సెవెన్ రేస్ ఆఫ్ లైట్ అనే జర్మన్ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. స్పెయిన్ వనిత డోనా, అర్జెంటైనాకు చెందిన రేయన్స్, సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, అజ్జరపు శ్రీనివాస్, జ్యోతిషాచార్య ఎస్ఎస్ రాము, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న లుడ్గర్ ఫిలిప్స్, గురుప్రసాద్

ఆరాధ్యనీయుడు మాస్టర్ ఈకే

మహారాణిపేట: అనేక మందిని హోమియో వైద్యులుగా తీర్చిదిద్ది మాస్టర్ ఈకే ఆరాధ్యులయ్యారని జగద్గురుపీఠం జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.ఎస్. శాస్త్రి అన్నారు. శుక్రవారం అంకోసా హాలులో జగద్గురు పీఠం రెండవ రోజు గురుపూజోత్సవాలలో హోమియో గోష్టి నిర్వహించారు. హోమియో వైద్యులకు విజ్ఞానంతో పాటు యోగ దృష్టి కూడా ఉండాలని, మాస్టర్ ఈకే రచించిన సైన్స్ ఆఫ్ మేన్ అనే గ్రంథంలో ఇదంతా ఉందన్నారు. సంస్థ సలహా మండలి సభ్యుడు వి.వి.రామకృష్ణశాస్త్రి మాట్లాడుతూ పశువులకు కూడా తమ సంస్థ ద్వారా హోమియో సేవలు అందిస్తున్నామన్నారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. కుంకుమ పూజలో విదేశీ మహిళలు కూడా పాల్గొన్నారు. పప్పు పద్మావతి వీణ కచేరీ ఆకట్టుకుంది. వైద్యులు పి.రమణ, పి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


హోమియో గోష్టిలో మాట్లాడుతున్న డాక్టర్ కేఎస్ శాస్త్రి